సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 13 । జూన్ । 2023



విత్తన ఎంపికే కీలకం

ఖరీఫ్‌కు విత్తన ఎంపికే కీలకం కానుంది. రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నారు.

- 8లో



తోటపల్లి నీరు విడుదల

తోటపల్లి నీటిని విడుదల చేశారు. కాలువల ద్వారా నాగావళి నీరు ప్రవహిస్తోంది.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	36°	30°
ఇచ్ఛాపురం	36°	29°
పాతపట్నం	37°	29°
శ్రీకాకుళం	37°	30°

న్యూస్‌రీల్

ఏడుగురు డీటీలకు పదోన్నతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ఏడుగురు డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతులు లభించాయి. జోన్‌–1 పరిధిలో గల రెవెన్యూ విభాగంలో 22 మంది ఉప తహసీల్దార్లకు డీపీసీ ద్వారా తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించారు. వీరిలో జిల్లాకు చెందిన ఎన్‌.ప్రసాదరావు, బి.ప్రకాశరావు, ఎస్‌.కామేశ్వర రెడ్డి, ఎన్‌.రమేష్‌ కుమార్‌, జి.లక్ష్మీనారాయణ, ఎస్‌.గణపతి, ఎం.శ్రీకాంత్‌లు ఉన్నారు. వీరికి పోస్టింగులు ఇవ్వాల్సి ఉంది.

సజావుగా ఏపీ డీఈఈ సెట్‌

ఎచ్చెర్ల క్యాంపస్‌: జిల్లాలోని రెండు పరీక్ష కేంద్రాల్లో సోమవారం ఆన్‌లైన్‌ పద్ధతిలో ఏపీ డీఈఈ సెట్‌ నిర్వహించారు. చిలకపాలెం శ్రీ శివానీ ఇంజినీరింగ్‌ కాలేజ్‌లో 190కి 145 మంది హాజరు కాగా, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్‌ కాలేజ్‌లో 174 మందికి 122 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌, జేసీ నవీన్‌ ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌ అన్నారు. మలేరియా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా మలేరియా నిర్మూలన, ఫ్రైడే డ్రైడే పై వైద్య ఆరోగ్య శాఖ ప్రచురించిన పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. రానున్న వర్షాకాలంలో సీజనల్‌ వ్యాధులతో పాటు డెంగీ, మలేరియా, చికెన్‌ గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున, అవిరాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు.

రాజశ్యామల యాగం ప్రారంభం



యాగం కోసం వేసిన అష్టదళపద్మం

శ్రీకాకుళం కల్చరల్‌: శ్రీకాకుళంలోని నానుబాల వీధిలో వేంచేసిన విజయదుర్గ అమ్మవారి ఆలయంలో రాజశ్యామల యాగంలో భాగంగా ఆవరణార్చనలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ, ఫణికుమార్‌ శర్మల నేతృత్వంలో పూజలు చేసి యాగం ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్‌ విశ్వేశ్వరరావు, నిర్మల, రామ్‌కుమార్‌ సుకన్య దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గూడెంలో ఎలుగు బంటి హల్‌చల్‌



రోడ్డు దాటుతున్న ఎలుగు బంటి

టెక్కలి రూరల్‌: టెక్కలి నుంచి మెళియాపుట్టి వెళ్లే రహదారిపై గూడెం గ్రామ సమీపంలో సోమవారం ఒక ఎలుగు బంటి రహదారి దాటుతూ స్థానికులకు కనిపించింది. అటుగా వెళ్లిన వాహనదారులు బంటిని చూసి భయపడ్డారు. గ్రామ సమీపంలో ఎలుగు బంటి తిరుగుతుండటంతో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందారు.

టీడీఆర్‌లు ఇచ్చేందుకు చర్యలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్డును వెడల్పు చేసేందుకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొంతమంది ఆస్తులను కోల్పోగా నష్టపరిహారం కింద టీడీఆర్‌ ఇవ్వాలని కోరారు. దానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు, కమిషనర్‌ ఓబులేసు అంగీకారం తెలిపారు. టీడీఆర్‌లు ఇచ్చేందుకు కార్పొరేషన్‌ టీపీఓ ఉమామహేశ్వరరావుకి బలగ, బుచ్చిపేట ప్రాంత వాసులు వినతి పత్రం అందించారు.

రికార్డ్‌ స్థాయిలో లాభాల పరపతి



డీసీసీబీ ప్రధాన కార్యాలయం

- పీఏసీఎస్‌లకు తొలిసారి అత్యధిక డివిడెండ్‌
- పెరిగిన ఆర్థిక కార్యకలాపాలతో భారీగా లాభాలు
- వచ్చిన లాభాలను పీఏసీఎస్‌లకు పంచిపెడుతున్న డీసీసీబీ



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) చరిత్రలో తొలిసారిగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు(పీఏసీఎస్‌) అత్యధిక డివిడెండ్‌ అందజేస్తోంది. 87 ఏళ్ల చరిత్ర గల డీసీసీబీ 2022–23లో అత్యధికంగా రూ.15 కోట్ల లాభాలను ఆర్జించింది. తనకు వచ్చిన లాభాలను సభ్యులుగా ఉన్న పీఏసీఎస్‌లకు 6శాతం డివిడెండ్‌ కింద పంచిపెట్టనుంది. దాదాపు రూ.5.30కోట్లను జిల్లాలోని 49 పీఏసీఎస్‌లకు పంపిణీ చేయనుంది. డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో రెండో ఫ్లోర్‌ శంకుస్థాపన సందర్భంగా మంగళవారం నిర్వహించనున్న కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, డీసీసీబీ చైర్మన్‌ కరిమి రాజేశ్వరరావు, డీసీసీబీ సీఈఓ డి.వరప్రసాద్‌ చేతుల మీదుగా డివిడెండ్‌ అందజేసే కార్యక్రమం జరగనుంది.

ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం..



డీసీసీబీ తన పరిధిలో ఉన్న పీఏసీఎస్‌లకు లాభాలు పంచి పెట్టడమనేది చాలా అరుదు. అది కూడా 1, 2శాతం డివిడెండ్‌ రూపంలో ఇస్తూ వచ్చేది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, పాలకవర్గం చొరవ, అధికారుల పనితీరుతో డీసీసీబీ కార్యకలాపాలు విస్తృతమయ్యాయి. దీంతో 2019 నాటికి రూ.1071.36కోట్ల మేర ఉన్న టర్నోవర్‌ ఇప్పుడు రూ.2047.28కోట్లకు పెరిగింది. గతంలో రూ.438.69కోట్లు ఆప్కాబ్‌ నుంచి అప్పుగా తీసుకోగా ఇప్పుడది రూ.1353.51కోట్లకు పెరిగింది. షేర్‌ కేపిటల్‌ అండ్‌ రిజర్వు కింద 2019లో రూ.103.77కోట్లు ఉండగా ఇప్పుడది రూ.198.47 కోట్లకు చేరింది. 2019లో రూ.347.47కోట్ల మేర డిపాజిట్లు ఉండగా ఇప్పుడవి రూ.429.33కోట్లకు పెరిగింది. పెట్టుబడులు సైతం 2019లో రూ.137.5 కోట్లు ఉండగా ఇప్పుడవి రూ.1533.82కోట్లకు చేరా యి. రుణాలు, అడ్వాన్సుల కింద 2019లో రూ.723.89కోట్లు ఉండగా ఇప్పుడవి రూ. 1617.95 కోట్లకు పైగా చేరింది. ఎన్‌పీఏ కూడా గతంలో 3.52శాతం ఉండగా ఇప్పుడది 2.51శాతానికి తగ్గింది. 2019లో రూ.4.18కోట్ల మేర వార్షిక లాభం పొందగా ఇప్పుడది రూ. 15కోట్లకు దాటింది. ఇలా అన్ని రకాలుగా డీసీసీబీ ప్రగతి సాధించింది.

లాభాలను పంచుతూ..

ఆర్థిక కార్యకలాపాలను పెంచుకుని అభివృద్ధి చెందుతున్న డీసీసీబీ తొలిసారిగా తన పరిధిలో ఉన్న పీఏసీఎస్‌లకు ఆర్థిక లబ్ధిని కూడా చేకూరుస్తోంది. పీఏసీఎస్‌లకు ఇచ్చిన రుణ సాయంలో నిబంధనల మేరకు 10శాతం షేర్‌ కేపిటల్‌ కింద తన వద్ద ఉంచుకుంటోంది. ఈ విధంగా 2022–23లో క్రాప్‌ లోన్స్‌ కింద రూ.765.85కోట్లు, షార్ట్‌ టర్మ్‌ రుణాల కింద రూ. 487.19కోట్లు, లాంగ్‌ టర్మ్‌ రుణాల కింద 18.95కోట్లు పీఏసీఎస్‌లకు ఇచ్చింది. మొత్తంగా చూస్తే ఒక్క పీఏసీఎస్‌లకే రూ.1271.99కోట్లు రుణాల రూపంలో అందజేసింది. దీంతో 10శాతం షేర్‌ కేపిటల్‌ కింద రూ.133.96కోట్లు ఉంచుకుంది. ఇప్పుడా షేర్‌ కేపిటల్‌కు 6శాతం డెవిడెంట్‌ అందజేస్తున్నది. ఎప్పుడూ లేని విధంగా రూ.15కోట్ల మేర డీసీసీబీకి లాభాలు రావడంతో అందులో రూ.5.30 కోట్ల మేరకు 49 పీఏసీఎస్‌లకు డివిడెండ్‌ కింద మంగళవారం పంపిణీ చేయనుంది. డీసీసీబీ చరిత్రలో ఇదొక రికార్డు.

రుణాల మంజూరులోనూ..

డీసీసీబీ అనేక రకాలుగా రైతులకు రుణాలు అందిస్తోంది. డీసీసీబీ పరిధిలో 49 పీఏసీఎస్‌లు, 86బి క్లాస్‌ సొసైటీలు ఉన్నాయి. ఒక్క పీఏసీఎస్‌ల్లో 2,29,873మంది సభ్యులుండగా, రుణ గ్రహీతలు 1,64,061 మంది ఉన్నారు. సీకేసీసీ ఖాతాదారులైతే 1,23,516మంది ఉన్నారు. మొత్తంగా 2,94,201మంది ఖాతాదారులు డీసీసీబీ సేవలు పొందుతున్నారు. గతంలో ఒక్క క్రాప్‌, గోల్డ్‌ రుణాలకే పరిమితమయ్యేది. ఇప్పుడు పరిధి బాగా పెరిగింది. క్రాప్‌ రుణాల కింద లక్షా 18వేల మంది రైతులకు రూ.800కోట్ల మేర అందించింది. ఆప్కాబ్‌ నుంచి రూ. 5శాతం వడ్డీకి రుణం తీసుకోగా పీఏసీఎస్‌లకు 5.75శాతంకే ఇచ్చి, వాటి ద్వారా రైతులకు 7శాతం వడ్డీతో పీఏసీఎస్‌ల ద్వారా రుణాలిస్తోంది. బంగారు రణాలను అత్యధికంగా రూ. 15లక్షలు వరకు ఇస్తోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.317.89కోట్లను బంగారు రుణాల కింద అందజేసింది. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న రైతులకు రూ.32 కోట్ల మేర రుణాలు అందజేసింది. కమ్యూనిటీ హైరింగ్‌ సెంటర్లుగా ఏర్పడిన రైతు సంఘాలకు రూ. 35.06కోట్లతో 586 ట్రాక్టర్లు, రూ.5.46కోట్ల విలువైన 43 హార్వెస్టింగ్‌ యూనిట్లు అందజేసింది. రూ.13.10కోట్ల విలువైన ఇంప్లిమెంట్స్‌ను 819మందికి అందజేసింది. ఇలా వివిధ రకాల రుణాలను అందజేసి, తన కార్యకలాపాలను రోజురోజుకీ విస్తృతం చేసింది.

స్పందన వినతుల పరిష్కారానికి కృషి

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన, ఏపీ సేవ, మీ సేవల ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌ అధికారులను ఆదేశించారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్‌ కలెక్టర్‌ ఎం.నవీన్‌, ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళీకృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్‌ జయదేవితో కలిసి ఆయన వినతులు స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలు మళ్లీ రీ ఓపెన్‌ కాకుండా సరైన పరిష్కారం చూపించాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖలకు సంబంధించిన అర్జీలపై సమీక్షించారు. జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో అందే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, డీఎస్‌ఓ వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్‌, జిల్లా పరిషత్‌ సీఈఓ వెంకటరామన్‌ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌, జేసీ నవీన్‌, అధికారులు

చంద్రకళా.. నీది గొప్ప జన్మ

జి.సిగడాం: తాను చనిపోతూ మరో ఎనిమిది మందికి పునర్జన్మ ప్రసాదించిన పట్నాన చంద్రకళను గ్రామస్తులు వేనోళ్ల కీర్తించారు. చంద్రకళ చేసిన త్యాగం నిరుపమానమని, ఆమెది గొప్ప జన్మ అని కొనియాడారు. మండలం మధుపాం గ్రామానికి చెందిన పట్నాన చంద్రకళ(32) బ్రెయిన్‌డెడ్‌ అవ్వడంతో ఈనెల 2వ తేదీన మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె అవయవాలను దానం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామంలో చంద్రకళ సంతాప సభ నిర్వహించారు. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు ఉండడంతో స్థానికులు, యువత కలిపి రూ.2 లక్షలు సేకరించి వారి పేరున డిపాజిట్‌ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ బగాది అప్పలనాయుడు, మాజీ సర్పంచ్‌ నల్లి తవిటినాయుడులతో పాటు గ్రామస్తులు, యువత పాల్గొన్నారు. ఈ కుటుంబంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఆదుకోవాలని స్థానికులు కోరారు.



చిన్నారులకు నగదును అందజేస్తున్న గ్రామస్తులు

● మత్తు వదలరా..



డ్రగ్స్‌ జోలికి పోవద్దంటూ పోలీసులు నినాదమిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం శ్రీకాకుళంలో ట్రాఫిక్‌ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో మానవ హారం, ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వల్ల వచ్చే అనర్థాలను వివరించారు.

- శ్రీకాకుళం క్రైమ్‌

ఎస్పీ స్పందనకు 50 అర్జీలు



ఎస్పీ జీఆర్‌ రాధికకు తమ సమస్యను విన్నవించుకుంటున్న అర్జీదారులు

శ్రీకాకుళం క్రైమ్‌ : స్పందనలో వచ్చే ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టాలని, బాధితులకు సకాలంలో న్యాయం చేయాలని ఎస్పీ జీఆర్‌ రాధిక అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందనకు 50 అర్జీలు అందాయి. అర్జీదారులు తమ సమస్యలను ఎస్పీతో విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మా ట్లాడుతూ ఫిర్యాదులన్నింటిపై చట్టపరమైన విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి పాల్గొన్నారు.

‘ప్రభుత్వ భూమిని కాపాడాలి’

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం రూరల్‌ మండలంలో పాత్రునివలస రెవెన్యూ పరిధిలోని సుమా రు 5.30 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేశారని, ఆ ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు అధికారులను కోరారు. ఈ ఆక్రమణలపై ఇటీవల ‘సాక్షి’లోనూ కథనాలు ప్రచురితమయ్యాయి. ఆ కథనాలపై స్పందిస్తూ భూములను రక్షించాలని బ గాది శ్రీరామ్మూర్తి, పలువురు రైతులు సోమవారం స్పందనలో కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ఆక్రమణలపై ఫిర్యాదులు, పత్రికల్లో కథనాలు వస్తున్నా దర్జాగా ఆ భూమిని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని తెలిపారు. సాయి డెంటల్‌ కాలేజ్‌ ఎదురుగా దాదాపు 5.30 ఎకరాల ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా అమ్మేస్తున్నారని ఆరోపించారు. జాతీయ రహదారికి అనుకుని సర్వే నంబర్‌ 161/30 లో ఒక ఎకరా 18 సెంట్లు సీలింగ్‌ ల్యాండ్‌ అప్పట్లో ముగ్గురికి సాగు చేసుకోవటానికి పట్టాలు ఇచ్చారని, వారు ముగ్గురు కూడా అమ్మేశారని, అందులో భాగం డీ పట్టా భూమి ఉందని తెలిపారు. వాటిని రక్షించాలని వారు కోరారు. అలాగే ప్రభుత్వ స్థలంలో దాదాపు 60 సెంట్లలో అక్రమంగా ఓ బిల్డింగ్‌ నిర్మాణం కూడా జరిగిందని దాన్ని తొలగించాలని తెలిపారు.

పలు రైళ్లు రద్దు

కాశీబుగ్గ: ఒడిశా రైలు ప్రమాదం తర్వాత రైల్వే ట్రాక్‌ పునరుద్ధరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈనెల 13వ తేదీన వెళ్లాల్సిన సంత్రాగచ్‌–చెన్నై, హౌరా–బెంగళూరు ఏఎంవీటీ, షాలీమార్‌–చెన్నై, షాలీమార్‌–హైదరాబాద్‌, సికింద్రాబాద్‌–షాలీమార్‌, విల్లుపురం–ఖరగ్‌పూర్‌ రైళ్లు రద్దు చేశారు. అదేవిధంగా 14వ తేదీన వెళ్లాల్సిన ఎస్‌ఎంవీటీ బెంగళూరు–హౌరా, భాగల్పూర్‌–బెంగళూరు, షాలీమార్‌–సికింద్రాబాద్‌ రైళ్లను సైతం రద్దు చేశారు.

జగనన్న కానుక.. జనమంతా వేడుక



విద్యా కానుక కిట్‌ అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌ తదితరులు

- తెరచుకున్న బడులు
- ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక సంబరాలు
- ప్రజాప్రతినిధులు, పేరెంట్స్‌ కమిటీ చేతులమీదుగా కానుకల అందజేత
- టెన్త్‌టాపర్లకు జగనన్న ఆణిముత్యాల పేరిట సన్మానాలు, నజరానా అందజేత



శ్రీకాకుళంలో ప్రతిజ్ఞ చేస్తున్న పిల్లలు

శ్రీకాకుళం న్యూకాలనీ: వేసవి సెలవులు ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా సోమవారం బడులన్నీ పునఃప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తొలిరోజే జగనన్న విద్యాకానుక పంపిణీ మొదలైంది. పిల్లలు బడులకు వచ్చేసరికి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు ఉంచేలా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంది.

బడుల్లో జగనన్న కానుక సందడి..

ఇలా బడులు తెరుచుకున్నాయో లేదో.. జగనన్న విద్యాకానుక సంబరాలు మొదలయ్యాయి. పాఠశాలలు తెరిచిన రోజే విద్యాకానుక అందజేస్తామని చెప్పిన మాటను ప్రభుత్వం మరోసారి నిలబెట్టుకుంది. జగనన్న విద్యాకానుక వరుసగా నాల్గో విడత పంపిణీ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా పండగ వాతావరణంలో మొదలైంది. 2020–21, 2021–22, 2022–23 విద్యా సంవత్సరాల్లో జగనన్న విద్యాకానుక అందజేసిన విషయం తెలిసిందే. ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాకానుకను అందజేస్తున్నారు. 30 మండలాలతో కూడిన శ్రీకాకుళం జిల్లాలో 1,91,394 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేస్తున్నారు. ఒక్కో కిట్‌ విలువ సుమారు రూ.2500 ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన జిల్లాకు రూ.45 కోట్ల మేర జగనన్న విద్యాకానుకలను అందజేసేందుకు విద్యార్థుల కోసం ప్రభు త్వం వెచ్చించింది. ఈ విద్యాకానుక ద్వారా నాణ్యతతో కూడిన ఏకరూప దుస్తులు(యూనిఫాం) మూడు జతలు, ఒక స్కూల్‌ బ్యాగ్‌, షూ, సాక్సులు రెండు జతలు, బెల్టు, బైలాంగ్వేజ్‌ పాఠ్యపుస్తకాలు(తెలుగు/ఇంగ్లిష్‌), వర్క్‌బుక్స్‌, నోట్‌బుక్స్‌, డిక్షనరీ మొత్తం 9 వస్తువులు అందజేస్తున్నారు. ఈ ప్రక్రియ ఈ నెలాఖరు వరకు కొనసాగనుంది.

విద్యారంగానికి పెద్దపీట

శ్రీకాకుళం రూరల్‌: ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండల పరిధిలోని సింగుపురంలో గ్రామంలో గల జెడ్పీహెచ్‌ స్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్‌ అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉందన్నారు. విపక్ష నాయకుల విమర్శలు అర్థ రహితమన్నారు. మన పిల్లలు ప్రపంచంతో పోటీ పడాలంటే ఇంగ్లిష్‌ తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్‌ స్కీమ్‌ ఆంధ్రప్రదేశ్‌లోనే అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. గ్యారెంటీ పెన్షన్‌ స్కీమ్‌ను తీసుకొచ్చామని కేబినెట్‌లో ఆమోదించామని తెలిపారు. కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌ మాట్లాడుతూ జిల్లాలో లక్షా 91వేల మంది పిల్లలకు జగనన్న విద్యాకానుక పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో కిట్‌లో 9 రకాల వస్తువులు ఉంటాయని, వీటి విలువ రూ. 2,500 ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఈఓ తిరుమలరావు, ఏపీసీ రోణంకి జయప్రకాశ్‌, తహసీల్దార్‌ ఎన్‌.వెంకటరావు ఎంఈఓ జి.కృష్ణారావు, ఎంపీపీ అంబటి నిర్మలా శ్రీనివాస్‌, జెడ్పీటీసీ రుప్ప దివ్య, బగ్గు అప్పారావు, నక్క శంకర్‌ పాల్గొన్నారు





పొందూరు: కింతలి హైస్కూల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్న స్పీకర్‌ తమ్మినేని సీతారాం

తొలిరోజు 30.43 శాతం హాజరు..


వేసవి సెలవుల తాపం నుంచి విద్యార్థులు ఇంకా బయటపడినట్టు లేదు. జిల్లాలో 2655 ప్రభుత్వ బడుల్లో 30.43 శాతం మంది విద్యార్థులు తొలిరోజు పాఠశాలలకు హాజరయ్యారు. ఇందులో మెజారిటీ విద్యార్థులు జగనన్న విద్యాకానుక కిట్లు అందుకున్నారు. ప్రైవేటు పాఠశాలలకు తొలిరోజు 18.93 శాతం మంది మాత్రమే హాజరయ్యారు.



తొలిరోజు స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థిని

‘ఆణిముత్యాలు’కు సత్కారం..

టెన్త్‌క్లాస్‌ ఫలితాల్లో రాణించిన విద్యార్థులను సన్మానించి, ఆర్థికంగా నజరానా అందజేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నాలుగు దశల్లో తొలి దశగా పాఠశాల టాపర్లను అభినందించి సన్మానించనున్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచినవారికి వరుసగా రూ.3వేలు, 2వేలు, వెయ్యి చొప్పున నజరానా, ప్రశంసా పత్రం, మెడల్‌ను అందజేశారు. తల్లిదండ్రులు, తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను కూడా మెచ్చుకున్నారు. ఈ నెల 15న నియోజకవర్గస్థాయిలో, 17వ తేదీన జిల్లాస్థాయిలో, 20వ తేదీన రాష్ట్ర స్థాయిలో జగనన్న ఆణిముత్యాల పేరిట ఘనంగా సత్కరించి, నజరానా అందజేయనున్నారు. సీఎం జగన్‌ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్ణయంతో బాలబాలికల్లో నూతనోత్సాహం తోపాటు పోటీతత్వం పెరుగుతుందని తల్లిదండ్రులు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పాఠశాలల్లో ఇప్పటికే అడ్మిషన్ల పర్వం మొదలవగా.. తాజాగా బడులు తెరిచిన రోజే చాలా మంది సర్కారీ బడుల్లో అడ్మిషన్లు పొందారు.



తొలిరోజు లాలింపు..



విద్యాకానుకతో..



బడికి వెళ్లే ముందు..

క్లుప్తంగా

విపత్తుల నిర్వహణ జిల్లా చైర్మన్‌గా మోహన్



నియామక పత్రాన్ని అందుకుంటున్న మోహన్

శ్రీకాకుళం అర్బన్: విపత్తుల నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్)కు సంబంధించి జిల్లా చైర్మన్‌గా శ్రీకాకుళం లయన్స్‌క్లబ్ చైర్మన్ నటుకుల మోహన్ నియమితులయ్యారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు మోహన్ చేసిన వివిధ సేవలను గుర్తించి విజయనగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ బాధ్యతలను అప్పగించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి లయన్స్ అంతర్జాతీయ సంస్థ నిర్దేశించిన కార్యక్రమంలో భాగంగా డిస్ట్రిక్ 316–ఏ రీజియన్–4, 5 సంయుక్తంగా ఏర్పాటు చేసిన పీఎస్‌టీ స్కూలింగ్ ప్రోగ్రాంలో జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ ఎ.గోపాలరావు, పూర్వపు గవర్నర్ రాఘవేంద్రరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని మోహన్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సేవలకు గుర్తింపు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. మోహన్‌ను జోన్ చైర్మన్ బాడాన దేవభూషణరావు, వివిధ సంస్థల ప్రతినిధులు అభినందించారు.

ఆదిత్యుడ్ని దర్శించుకున్న హాస్యనటులు



ఆదిత్యుని సన్నిధిలో హాస్యనటులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని బుల్లితెరకు చెందిన పలువురు హాస్యనటులు సోమవారం ఉదయం దర్శించుకున్నారు. జబర్దస్త్ ఫేం అప్పారావు, మోహన్, వినోద్ తదితరులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వర్గాలు వారికి గౌరవంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనాన్ని చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సీనియర్ హాస్యనటుడు అప్పారావు మాట్లాడుతూ.. స్వామివారి దివ్య ఆశీస్సులతోనే ఆరోగ్యంగా ఉంటూ హాస్యాన్ని పండిస్తున్నామన్నారు.

సమతా సమ్మేళనం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ వెంకటరావు తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సమతా సమ్మేళనం వాల్ పోస్టరస్ వైస్‌చాన్సలర్ నిమ్మ వెంకటరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 25వ తేదీన శ్రీకాకుళం పట్టణంలోని ఆనందమయి కన్వెన్షన్ హాల్లో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల సమతా సమ్మేళనం జరగనుంది. సభ్యులు సంతోష్‌కుమార్, ఆనంద్, భాస్కరశాస్త్రి పాల్గొన్నారు.

రుచిగా 'గోరుముద్ద'



బిర్యాని రుచిచూస్తున్న ఎంపీపీ రఘురామ్

గార: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న గోరుముద్ద రుచిగా ఉందని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. సోమవారం శ్రీకూర్మం ఉన్నత పాఠశాలలో గోరుముద్ద కార్యక్రమాన్ని పరిశీలించారు. బిర్యానీ రుచి చూసి బాగుందన్నారు. విద్యార్థులు, భోజన కార్మికులతో మాట్లాడారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులున్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,450–00
బంగారం(22సి. 10గ్రా.)	55,400–00
వెండి (కిలో)	79,300–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ.519.00
శ్రీకాకుళం	రూ.519.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹180	₹315	₹ 335

విత్తన ఎంపికే కీలకం..

- సబ్సిడీపై రైతులకు వరి విత్తనాలు
- 656 ఆర్‌బీకేల ద్వారా పంపిణీకి చర్యలు



వరిచేను (ఫైల్)

ఆమదాలవలస రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడం, కొద్దిపాటి వర్షాలు కూడా పడుతుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ అవుతున్నారు. ఎలాంటి పంటలను సాగు చేయాలి, విత్తనాల ఎంపిక్పై ఆలోచనలు చేస్తున్నారు. ఏ రకం వరి విత్తనాలను ఎంపిక చేసుకోవాలి, ఏ రకం వేస్తే తెగుళ్లను, వాతావరణ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడులు వస్తాయో ఆలోచన చేస్తున్నారు. ఈ పరిస్థితిలో విత్తన ఎంపికే కీలకమని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ సుమారు ఐదు నెలల కాలపరిమితిలో పంట సాగు చేస్తే ధాన్యం దిగుబడులు చేతికి వస్తాయి. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రైతులకు అందుబాటులోకి రైతు భరోసా కేంద్రాలను తీసుకువచ్చి వాటి ద్వారా రైతులకు విశిష్ట సేవలను అందిస్తుంది. వ్యవసాయాన్ని పండుగలా చేసుకునే విధంగా ప్రభుత్వం రైతులకు అనేక సంక్షేమ పథకాలతో పాటు కావాల్సిన విత్తనాలను సరఫరా చేస్తుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఏ రకం విత్తనాలు కావాలో ముందుగానే అర్డర్ చేసుకోవడం ద్వారా ప్రతి రైతుకు సకాలంలో విత్తనాలు అందుతున్నాయి. ఇలాంటి సమయంలో రైతులకు నచ్చిన విత్తనాలను ఎంపిక చేసుకునేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పలు సూచనలు చేస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లాలో 30 మండలాల పరిధిలో 1.78 లక్షల హెక్టార్లలో వరిని సాగు చేస్తుంటారు. దీనికి అనుగుణంగా 656 ఆర్‌బీకేల ద్వారా 35,040 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేసేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. రైతులు తగిన విత్తనాలను ఎంపిక చేసుకుని సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించగలరని ఆమదాలవలస మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు సూచించారు. ఏ రకం విత్తనం.. ఏ నేలకు అనుకూలమో వివరించారు.



మెట్ట మోహనరావు, మండల వ్యవసాయాధికారి, ఆమదాలవలస

అందుబాటులో ఉన్న వరి విత్తనాలు

- ఎంటీయూ 1121 శ్రీధృతి రకం పంటకాలం 140–142 రోజులకుగాను ఎకరాకు 28.30 బస్తాల దిగుబడి వస్తుంది. ఆకు ముడత పురుగును తట్టుకుంటుంది.
- ఎంటీయూ 7029 స్వర్ణ రకం పంటకాలం 150–152 రోజులు. ఎకరాకు 26.50 బస్తాల దిగుబడిని ఇస్తుంది.
- బీపీటీ 5204 సాంబమసూరి రకం పంటకాలం 143–145 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎకరాకు 28.50 బస్తాల దిగుబడిని ఇస్తుంది.
- ఎంటీయూ 1315 రకం పంటకాలం 145–148 రోజులకు ఎకరాకు 24.50 బస్తాల దిగుబడి వస్తుంది. మధ్యస్థ సన్న రకం, తెలుపు గింజ, అగ్గి తెగులు, ఆకుమచ్చ తెగుళ్లను గతంలో శాస్త్రవేత్తలు గమనించారు.
- ఎంటీయూ 1318 రకం పంట కాలం 155–160 రోజులు. ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తుంది. అధిక పిలకలు వేసి దిగుబడి బాగున్నప్పటికీ అపరాలు చేస్తున్న ప్రాంతానికి అనువుగా లేదు. వరి తరువాత మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు సాగు చేస్తున్న ప్రాంత రైతులు ఆసక్తి చూపుతున్నారు.
- ఆర్‌జీఎల్ 2537 శ్రీకాకుళం సన్నాల రకం 160 రోజుల్లో ఎకరాకు 30 బస్తాల దిగుబడిని ఇస్తుంది. మధ్యస్థ సన్న గింజ రకం. 160 సెంటీమీటర్ల ఎత్తు పెరుగుతుంది. చేను ఎక్కువగా పడిపోతుంది.
- ఎంటీయూ 1224 మార్టేరు సాంబ రకం 135 రోజుల్లో ఎకరాకు 26 నుంచి 28 బస్తాల దిగుబడి వస్తుంది. పంట చేను పడిపోదు. బియ్యం పారదర్శకంగా ఉండి అన్నానికి అనుకూలం.
- బీపీటీ 3291 సోనామసూరి రకం 135 నుంచి 140 రోజుల్లో ఎకరాకు 25 బస్తాల దిగుబడి వస్తుంది. గింజ సన్నంగా ఉండి, అన్నానికి బాగుంటుంది.
- ఎంటీయూ 1210 సుజాత రకం 125 నుంచి 135 రోజుల్లో ఎకరానికి 26 నుంచి 28 బస్తాల వరకు దిగుబడిని ఇస్తుంది. కాండం ధృడంగా ఉండి, చేను పడిపోదు. గింజ రాలిక తక్కువ. నేరుగా విత్తే విధానానికి కూడా అనుకూలం.
- ఎంటీయూ 1061 ఇంద్ర రకం 150 రోజుల్లో ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తుంది. సన్న గింజగా ఉండి తెలుపు రంగులో ఉంటుంది. చేను పడిపోదు. పది రోజుల వరకు ముంపును, కొద్దిపాటి చౌడును తట్టుకుంటుంది
- యంటియూ 1010 కాటన్ దొర సన్నాలు రకం 120 రోజుల్లో 32 బస్తాల దిగుబడిని వస్తుంది. గింజ సన్నగా.. పొడుగ్గా ఉంటుంది. ఎగుమతులకు అనుకూలం.
- ఎంటీయూ 1064 అమర రకం 150 రోజుల్లో ఎకరాకు 25 బస్తాల దిగుబడి వస్తుంది. చేను పడిపోదు. గింజ రాలదు. సన్న రకం గింజ. ముంపును బాగా తట్టుకుంటుంది.

రేపటి నుంచి ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐలు (పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో) ప్రవేశానికి ఈ నెల 14వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో సోమవారం షెడ్యూల్ వివరించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతోందన్నారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా షెడ్యూల్ మేరకు విద్యార్థులు హాజరు కావాలని సూచించారు. అన్‌లైన్ దరఖాస్తుల సమయంలో, ధ్రువీకరణ పత్రాల పరిశీలన సమయంలో పొందుపర్చిన సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. కౌన్సెలింగ్ ద్వారా రెండేళ్ల కోర్సులైన ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మెకానికల్ మోటార్ వెహికల్, ఏడాది కోర్సులైన వెల్డర్, మెకానిక్ డీజిల్, కటింగ్ అండ్ సూయింగ్, కోపా ట్రేడుల్లో ప్రవేశాలు కల్పిస్తామని వివరించారు. మార్కుల ప్రతిభ, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయని చెప్పారు. విద్యార్థులు దరఖాస్తు సమయంలో ఇచ్చిన మొబైల్‌కు కౌన్సెలింగ్ తేదీ, సమయం ఎస్ఎంఎస్ పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. 2040 మంది అభ్యర్థులు జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మొత్తం 3,676 సీట్లు ఉన్నాయి.

షెడ్యూల్ ఇలా...

తేదీ	మొదటి షిప్టు సమయం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట..	రెండో షిప్టు సమయం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు
14	1–217 ర్యాంకు 10.0–9.7 జీపీఏ	218 – 394 ర్యాంకు 9.5–9.2 జీపీఏ
15	395–634 ర్యాంకు 9.0–8.7 జీపీఏ	635–875 ర్యాంకు 8.5–8.2 సీపీఏ
16	876–1218 ర్యాంకు 8.0–7.3 జీపీఏ	1219–1516 ర్యాంకు 7.2–6.5 జీపీఏ
17	1517 – 1759 ర్యాంకు 6.3–5.4 జీపీఏ	1760–2040 ర్యాంకు 5.3–1.3 జీపీఏ

గొలివివానిపేటలో పొలంబడి

ఎచ్చెర్ల క్యాంపస్: వరి సాగులో ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రీసోర్సుపర్సన్ సువ్వారి సన్యాసిరావు అన్నారు. గొలివివానిపేటలో ఖరీఫ్ వరి సాగుపై సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి సాగులో ప్రకృతి వ్యవసాయ మెలకవులు తెలుసుకోవాలన్నారు. విత్తనశుద్ధి, వరిలో ఎద, నాట్లు సాగు, జీవామృతం వినియోగం, తెగుళ్ల నియంత్రణ పద్ధతులపై రైతులు పూర్తి సమాచారం తెలుసుకోవాలని చెప్పారు. సాగు యాజమాన్య ఖర్చులు తగ్గించటం, అధిక దిగుబడుల సాధనే లక్ష్యంగా రైతులు ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో గొలివి రామకృష్ణ, లీడ్ ఫార్మర్లు పాల్గొన్నారు.



పొలంబడి నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మీపేట దళితులకు న్యాయం చేయాలి

- సామాజిక న్యాయపోరాట సమితి విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న గణేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విజయనగరం జిల్లా వంగర మండలం లక్ష్మీపేట సంఘటన జరిగి 11 సంవత్సరాలు పూర్తయినా దళితులకు మాత్రం న్యాయం చేయలేదని సామాజిక న్యాయపోరాట సమితి నాయకులు అన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. మడ్డువలస రిజర్వాయర్‌లోని 250 ఎకరాల భూమిని దళితులకు పంపిణీ చేయాలి సమితి జిల్లా ప్రధానకార్యదర్శి డి.గణేష్, మాదిగ దండోరా జిల్లా నాయకులు కానుకుర్తి గోవింద్, యడ్ల జానకీరావులు కోరారు. లక్ష్మీపేట ఘటన జరిగి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీకాకుళంలోని అండబ్కేర్ విజ్ఞాన మందిర్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. అప్పట్లో సీఎంగా ఉన్న నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ఇచ్చిన హామీలను ప్రస్తుత పాలకులు అమలు చేయాలని కోరారు. అనంతరం మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు సిరిపురపు గురువులు, దూలపు అప్పన్న, రమణ, బాలకృష్ణ, వీరస్వామి, కుప్పిలి నుకున్నా, మురపాక వాసుదేవరావు, ఉర్లాపూ దుర్గారావు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన పాతనౌపడ గ్రామంలో చోటుచేసుకోగా ఇజ్జువరపు భీమారావు(48) ప్రాణాలు కోల్పోయినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. భీమారావు తన గ్రామంలో ఆదివారం జరిగిన శుభకార్యానికి హాజరై అధికంగా మద్యం తాగి ఇంటి వెళ్లాడు. దీంతో నిత్యం మందుతాగి ఎందుకు వేధిస్తున్నారని భార్య నిర్మల మందలించింది. మనస్తాపం చెందిన ఆయన ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి స్పృహ తప్పిపడిపోయాడు. అయితే సోమవారం ఉదయం చూసే సరికి భీమారావు నోటి నుంచి నురగలు రావడం గమనించి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు.



భీమారావు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

పిల్లలందరూ చదువు కోవాలి

- బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు
- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం అర్బన్: బడిబయట ఉన్న బాలలందరూ పాఠశాలల్లో చేరి చదువుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. చదువు కోవాల్సిన పిల్లలను పనిలో పెట్టుకుంటే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్మికశాఖ, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని ఎన్‌జీవో కార్యాలయం నుంచి వైఎస్సార్ కూడలి వరకూ నిర్వహించిన ర్యాలీని సోమవారం జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా చిన్నారులు బాల కార్మికులుగా తయారవుతున్నారని.. అటువంటి బాలలను గుర్తించి పాఠశాలలకు వెళ్లి విద్యను అభ్యసించేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు. మధ్యలో బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయని, బడి మానివేసిన పిల్లలు కూడా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దసరా, సంక్రాంతి పండుగల సెలవుల సమయాల్లో కూడా కొంతమంది పిల్లలు బడి మానేస్తుంటారని, అటువంటి వారిపై కూడా ప్రత్యేక శ్రద్ధను కనబరచి తిరిగి వారంతా బడిలో చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాలలు ఎట్టి పరిస్థితుల్లో చదువుమాని బయట ఉండకుండా, వారికి ఉజ్వల భవిష్యత్తు అందించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. చట్టానికి వ్యతిరేకంగా బాలలని పనిలో చేర్పించుకున్నవారు న్యాయపరంగా శిక్షకు అర్హులన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఐసీడీఎస్ పీడీ జి.జయదేవి, ఐసీపీఎస్ అధికారి రమణ, ఉప కార్మిక కమిషనర్ ఎస్.డి.వి.ప్రసాదరావు, సహాయ కార్మిక కమిషనర్ అజయ్ కార్తికేయ, సహాయ కార్మిక అధికారులు వై.శైలేష్ కుమార్, ఆర్.వి.వి. శ్రీనివాసరావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

18న జిల్లా అండర్–16 క్రికెట్ జట్టు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా అండర్–16 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలను ఈనెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం శ్రీకాకుళం అధ్యక్షులు పుల్లెల వైఎస్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి హసన్‌రాజ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఆ రోజు ఉదయం 8 గంటలకు ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2007 సెప్టెంబర్ ఒకటో తర్వాత జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, తదితర పత్రాలతో హాజరుకావాలన్నారు. అలాగే క్రీడాకారులు తెలుపురంగు యూనిఫాం, షూ విధిగా ధరించి హాజరుకావాలని శాస్త్రి, హసన్‌రాజ పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కోచ్ సుదర్శన్ (9441115396), కెఎస్ఎం శైలానీ (92466 31797), హసన్‌రాజ (8247264245)లను సంప్రదించాలని వారు కోరారు.

తోటపల్లి నీరు విడుదల



కుడిప్రధాన కాలువ ద్వారా సరఫరా అవుతున్న సాగునీరు

పార్వతీపురం: సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువకు సాగునీటిని ఎమ్మెల్యేలు పాములు పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, ఎస్.వెంకట చిన అప్పల నాయుడు తదితరులతో కలిసి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం విడుదల చేశారు. ముందుగా కాలువ వద్ద పూజలు చేశారు. నాగావళి నదికి హారతులిచ్చారు. కాలువలో పూలనువెదజల్లి ఈ ఏడాది ఆయకట్టుకు సాగునీరు పుష్కలంగా అందాలని, పంటలు బాగా పండి రైతులు బాగుండాలని ప్రార్థన చేశారు. అనంతరం ప్రాజెక్టు వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు నుంచి శివారు భూములకు సాగునీరు సరఫరాచేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, కలెక్టర్ నిషాంత్‌కుమార్ తదితరులతో జరిగిన సమావేశంలో ఈ ఏడాది నెలరోజుల ముందుగానే కాలువల ద్వారా సాగునీటిని సరఫరా చేయాలని నిర్ణయించామన్నారు. దానికి అనుగుణంగా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారని తెలిపారు. ఉపాధిహామీ నిధులతో కాలువలను బాగుచేసినట్టు వెల్లడించారు. పాతరెగ్యులేటర్ కుడి, ఎడమ కాలువలో లైనింగ్ పనులు జరుగుతున్నాయని, ఆ పనులును పూర్తిచేసిన తరువాత కాలువల ద్వారా సాగునీటిని సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో వర్షాలు పుష్కలంగా కురవడంతో పంటలు సమృద్ధిగా పండుతున్నాయన్నారు. రైతులు సాగు నీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సూచించిన విధంగా వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆయన కోరారు. నీటిని అవసరం మేరకు ఉపయోగించడం వలన మంచి దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉత్తరకోస్తా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు, కార్యనిర్వాహక ఇంజినీరు ఆర్.రామచంద్రరావు, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు టి. రఘునందనరావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీపీ ఉరిటి రామారావు, స్థానిక సర్పంచ్ ఎస్.దివ్యలక్ష్మితో పాటు వ్యవసాయ మండలి జిల్లా చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, పార్వతీపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, కురుపాం ఎంపీపీ ఎ.పద్మావతితో పాటు వివిధ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీరు సరఫరా ఇలా...

తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా 85వేల ఎకరాలకు సాగునీరు అందేలా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో పార్వతీపురం మన్యం జిల్లాలో బలిజిపేట, సీతానగరం మండలాల్లోని 4,418 ఎకరాలకు, శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, లావేరు, రణస్థలం మండలాల్లోని 23,351 ఎకరాలకు, విజయనగరం జిల్లాలోని రాజాం, రేగిడి ఆమదాలవలస, వంగర, సంతకవిటి, చీపురుపల్లి, గరివిడి, గుర్ల, నెల్లిమర్ల, పూసపాటిరేగ, బొబ్బిలి, బాడంగి, తెర్లాం, వంగర మండలాల్లోని 55,040 ఎకరాలకు సాగునీరు సరఫరా చేయనున్నారు.

అలాగే, ప్రాజెక్టు పాత రిజర్వాయిర్ కుడి,ఎడమ కాలువలద్వారా 64 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రిజర్వాయిర్ కుడి, ఎడమ కాలువల ద్వారా పార్వతీపురం మన్యం జిల్లాలో బలిజిపేట, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో 4191.99 ఎకరాలు, వీరఘట్టం, పాలకొండ మండలాల్లో 27,410 ఎకరాలు, విజయనగరం జిల్లా వంగర మండలంలో 4,298 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలంలో 1,345 ఎకరాలు, ఓపెన్ హెడ్ చానల్ ద్వారా 24,456 ఎకరాలు వెరసి 64 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు.

వెంకన్న ఆదాయం రూ. 2.88 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరం పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమల కొండపై వేంచేసిన వేంకటేశ్వరస్వామి హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 81 రోజులకు 2,88,580 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్యామలరావు తెలిపారు. లెక్కింపు ప్రక్రియలో దేవదాయశాఖ సూపర్‌వైజర్ వెంకటరమణ, ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, వేంకటేశ్వర సేవాదళ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన



ప్రాథమిక విద్యపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: పూర్వ ప్రాథమిక విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి అన్నారు. పొన్నాడ గ్రామంలో పూర్వ ప్రాథమిక విద్యపై సోమవారం అవగాహన కల్పించారు. ఆరేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. స్థానిక మహిళా పోలీస్ గిరజ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.